కథ

# అపోహ

"సీతాసత్య"

దగ్గరగా వేసి ఉన్న తలుపుల్ని విసురుగా తోసి అంతకంటే విసురుగా ఇంట్లోకి ప్రవేశిస్తూ "ఇడియట్.. ఇంకెప్పుడూ వెధవ్వేషాలు వేయడు" అని భుజానికి వేళ్ళాడుతున్న హాండ్‌బేగ్‌ను తీసి అలమారలో విసిరి సోఫాలో కూర్చుంది గాయత్రి.

"నీ దౌర్జన్యానికి ఇవ్వాళ బలైపోయిన ఆ మానవుడెవరో పాపం!" అన్నాడు భానుమూర్తి కళ్ళెగరేస్తూ.

గుండెల నిండా శ్వాస పీల్చుకుని కళ్ళు పెద్దవి చేసి భర్తవైపు చూస్తూ, "చ్చొ.. చ్చొ.. చ్చొ.. ఆ సమయంలో వాణ్ణి చాచిపెట్టి చెంపదెబ్బ కొట్టాలనే అనిపించింది గానీ వాడి పుట్టు పూర్వోత్తరాలు కనుక్కొచ్చి మీకు చెప్పాలనే ఆలోచనే నాకు రాలేదు సమా!" అంది గాయత్రి వెటకారంగా.

"పాపం ఏ తల్లి కన్న బిడ్డో కదా?!" అన్నాడు భానుమూర్తి ఆమెను మరింత కవ్విస్తూ.

"అవునవును. బిడ్డల్ని కనేది తల్లులే కానీ తండ్రులు కాదనే ఇంగితజ్ఞానమున్న వెధవెవడూ ఆ పని చేయడు మరి!" అంది గాయత్రి రోషంగా.

"నీ చేతి దెబ్బ తినాలని వాడి ముఖాన రాసున్నప్పుడు వాడికివన్నీ ఎలా గుర్తొస్తాయిలే.. అయినా ఇంతకూ వాడేం చేశాడో చెప్పనే లేదు నువ్వు." అన్నాడు భానుమూర్తి.

"చెప్పేం లాభం? ఏం జరిగిందో తెల్సుకునేటంత వరకేగా మీ ఆరాటం! తర్వాతెలానూ మీ జాతివాణ్ణి మీరు సమర్థించడం ఖాయమే కదా?" అంది గాయత్రి నిరసనగా.

"అదిగో ఆ మాటంటే నేనొప్పుకోను. మూడు నెలల క్రితం మీ మహిళా సంఘం వాళ్ళు రాత్రివేళల్లో ఊరూరా తిరిగి బహిరంగ సమావేశాలు జరిపినప్పుడు మీ సంఘం సభ్యురాళ్ళందరి భర్తల్లానే నేను కూడా సమావేశాలు ముగిసేంతవరకూ నీకేమీ కాకుండా కళ్ళల్లో వత్తులేసుకుని కాపలా కాశానా లేదా?"

"ఆ చేశార్లెండి పేద్ద! ఎవరి భార్యకు వారు ఏమీ కాకుండా చూసుకోవడంలో గొప్పేం ఉంది? అయినా మీ మగవాళ్ళకు మా మీద ఉన్నది ప్రేమని అనుకునేటంత పురాణ కాలపు ఆడవాళ్ళం కాము మేమెవరమూ. ఏ కొంటెవెధవో రాయి విసిరి మాకు దెబ్బ తగిలితే ఆ సాకుతో మేమెక్కడ మంచాలెక్కి మీ చేత సేవలు చేయించుకుంటామో అనే భయంతో మా చుట్టూ తిరిగి కాపలా కాశారు గానీ మా మీద ప్రేమ ఉండా?" అంది గాయత్రి.

"మొన్నటికి మొన్న... నీ ఫ్రెండ్ సుమతిని మతిలేని వాడొకడు పట్టుకుని నానా అల్లరీ చేస్తోంటే మే మందరమూ వాణ్ణి పట్టుకుని పిచ్చాసుపత్రిలో చేర్పించామా లేదా?" అన్నాడు భానుమూర్తి నిష్ఠూరంగా.

"మదపిచ్చివెధవని పిచ్చాసుపత్రిలో చేర్పించకపోతే సన్మానం చేస్తారా ఎవరైనా! అదీ గొప్పేనా?!" అంది గాయత్రి మూతి ముడుస్తూ.

"సరే ఒప్పుకుంటున్నాను. మగవారి కంటే కూడా నిస్సందేహంగా ఆడవారే నయం. ఇంతకూ ఇవ్వాళేమైందో చెప్పనే లేదు నువ్వు" అన్నాడు భానుమూర్తి.

"ఏదీ నన్ను చెప్పనిస్తేగా.. వచ్చినప్పటినుంచీ నన్ను ఆడిపోసుకోవడమే సరిపోయిందాయె మీకు" అంది గాయత్రి.

"సరే.. సరే నాదే తప్పు. నువ్వేం చెప్పినా బుద్ధిగా వింటాను. అనలేమీ మాట్లాడను. నువ్వు మాట్లాడమంటేనే మాట్లాడ్తాను" అంటూ బుద్ధిమంతుడిలా రెండు చేతులూకట్టుకుని, "ఊ" అన్నాడు భానుమూర్తి.

ఓ సారతడి వైపు చూసి తృప్తిగా తలాడించి, "మధ్యలో వెటకారంగా ఏమీ మాట్లాడకూడదు. నేనేం చెప్పినా బుద్ధిగా తలూపాలి మరి." అని, "ఈ రోజు ఆఫీసు నుంచి బయటికొచ్చి సిటీబస్‌స్టాప్‌లో నిలబడ్డానా..." అంది గాయత్రి.

"నిలబడే ఉంటావు!" అనబోయి "ఊ" అన్నాడు.

"ఎంతసేపటికీ బస్ రానేలేదు..."

"వస్తే ఆశ్చర్యంగానీ, రాకపోతే వింతేముందీ?" అనబోయి మళ్ళీ "ఊ" అన్నాడు భానుమూర్తి.

"కాస్సేపలా చూస్చూసి విసుగు పుట్టి హాండ్‌బ్యాగ్ లోంచి పత్రిక తీసి చదవడం మొదలుపెట్టాను. బహుశః పదినిమిషాల సేపు చదివి ఉంటానేమో, 'ఎక్స్‌క్యూజ్‌మీ' అనే మాటలు వినిపించి తలెత్తి చూశాను." అని భానుమూర్తి మొహంలోకి పరీక్షగా చూసింది గాయత్రి.

అతడి కళ్ళు 'అసలు విషయానికిరా' అన్నట్టుగా అనిపించి, "మీకంతా తొందరే!" అని విసుక్కుని, "పనిగట్టుకుని నన్ను పిలిచిందెవరా అని చూద్దును కదా.. మీ జాతివాడే.. మీ కంటే నాలుగైదేళ్ళు చిన్నవాడే అయ్యుంటాడు నన్ను రెప్ప వేయకుండా చూస్తూ మళ్ళీ 'ఎక్స్‌క్యూజ్ మీ' అన్నాడు.

"వాడి నక్క వినయానికి నాకు కోపమొచ్చి, "ఏం పాపం.. ఏం తప్పు చేశారూ?" అన్నాను. అప్పుడు వాడి మొహం చూడాలి." అని "ఎలా ఉందని అడగరేం?" అంది గాయత్రి.

"ఏవీ మాట్లాడొద్దన్నావుగా మధ్యలో" అన్నాడు భానుమూర్తి నసుగుతూ.

"ఎప్పుడేం మాట్లాడాలో మీకు తెలియదు కనుక అలా అన్నాను. సందర్భోచితంగా ఎదుటి వ్యక్తి మాట్లాడకపోతే చెప్పేవాళ్ళకు ఇంట్రెస్ట్ ఏం ఉంటుందీ" అంది గాయత్రి అసహనంగా.

"సరే.. సరే.. వాడి మొహం మాడిపోయిన పెసరట్టులానో, అప్పడంలానో ఉండుంటుంది. అవునా?" అన్నాడు భానుమూర్తి.

"పోలికలు కూడా రావు మీకు. అయినా మీ నుంచి సరైన కామెంట్స్ ఆశించడం నా తప్పే!" అని ఉత్తుత్తిగా చెంపలు చరుచుకుని, "నా మాటలకు వాడు తెల్లబోతే, చుట్టుపక్కలవాళ్ళు పగలబడి నవ్వారు." అంది గాయత్రి.

"ఇంతకూ వాడి మొహం ఎలా ఉందో చెప్పనే లేదు నువ్వు." అన్నాడు భానుమూర్తి.

ఓసారి భర్తను తేరిపారచూసి, "ఎబ్రాసి వాడిలా.. అంటే సరిగ్గా ఇప్పుడు మీ మొహం ఉన్నట్టే ఉంది. సరేనా! విషయం వినండి. మధ్యలో అడ్డు తగలకండి." అంది గాయత్రి.

ప్రయత్నం మీద ముఖకవళికల్ని మార్చుకుని, "ఇహ నువ్వడగమన్నా ఏఁవీ అడగనులే. ప్రస్తుతపు నా మొహంతో పోల్చదగ్గ మొహంతో ఉన్న ఆ ఎబ్రాసివాడప్పుడు ఏఁవన్నాడు?" అన్నాడు భానుమూర్తి వినయాన్ని తెచ్చిపెట్టుకుంటూ.

"చింత చచ్చినా పులుపు చావలేదని సామెత." అంది గాయత్రి వెటకారంగా.

భానుమూర్తి ఏమీ మాట్లాడలేదు. "అలా బండరాయిలా ఏ ఫీలింగ్సూ లేకుండా కూర్చునే వాళ్ళను చూస్తే నాకు ఒళ్ళుమంట." అంది గాయత్రి మళ్ళీ?

"ఊ" అని వినీ వినబడనట్టుగా అన్నాడు భానుమూర్తి.

"నా వైపు చేయి చాపాడు వాడు. నేనొక అడుగు వెనక్కి వేసి "చూడ్డానికి దున్నపోతులా వున్నావు. అడుక్కోవడానికి సిగ్గుగా లేదూ" అన్నాను. వాడు సిగ్గుపడిపోయి "నేను ముష్టివాణ్ణి కాదండీ" అన్నాడు. "మరి!" అన్నట్లు చూశాను. "మీ చేతిలోని పత్రికోసారి ఇస్తారేమోననీ!" అన్నాడు నీళ్ళు నములుతూ. ఏదో వంకతో పలకరించి దగ్గరవుదామనే ఇటువంటి వెధవల్ని నమ్మేందుకు నేను అమాయకురాల్ని కాదు కదా! అందుకే ఇవ్వనని నిర్మొహమాటంగా చెప్పేశాను.

వాడు నా కళ్ళలోకి పరీక్షగా చూసి, "మిమ్మల్నెక్కడో చూసినట్టుందండీ!" అన్నాడు. "కలలోనేమో?" అన్నాను నేను వెటకారంగా. చుట్టుపక్కల వాళ్ళంతా మళ్ళీ నవ్వారు. వాడు మొహం చిన్నబుచ్చుకుని కాస్సేపు మాట్లాడలేదు. అయిదు నిమిషాలలా గడిచాక మళ్ళీ

`ఎక్స్‌క్యూజ్ మీ` అన్నాడు. ఈసారి నేను పుస్తకంలోంచి తలెత్తలేదు.

వాడు నాకు దగ్గరగా వచ్చి, "మిమ్మల్నేనండీ!' అన్నాడు. నాకు చిర్రెత్తుకొచ్చింది. 'ఏవి'టన్నట్లు కోపంగా చూశాను. 'నేను ఆదర్శనగర్ వెళ్ళాలండీ' అన్నాడు. 'వెళ్ళు' అన్నట్టుగా చూశాను. 'నాకీ ఊరు కొత్తండీ. ఏ బస్ ఎక్కాలో తెలీదు. కొంచెం చెప్తారా?' అన్నాడు.

వాడి ఉద్దేశ్యం నాకు అర్థమైంది. ఆ బస్‌స్టాప్‌లో అప్పుడు అరడజను మంది ఆడవాళ్ళూ, అంతకు మూడురెట్లు మగవాళ్ళూ ఉన్నారపుడు. అందర్నీ వదిలేసి ఆ వెధవ ప్రత్యేకంగా నన్ను దారడగడవేమిటి? మేం నిలబడ్డ చోటు హిమాలయ పర్వతాల మధ్య లేదు. వాణ్ణి వాడు ప్రవరుడనుకుంటున్నాడేమో గానీ, నేను వరూధినిని కాననే విషయం వాడికి తెల్సినట్టు లేదు." అని భర్త మొహంలోకి చూసింది గాయత్రి.

విషయం పాకాన వడినట్టనిపించడంతో "ఊ.. ఊ " అన్నాడు భానుమూర్తి హుషారుగా.

"ఏవిటీ హుషారు తన్నుకొచ్చేస్తోందీ! నిన్నో మొన్నో మీరూ ఇలానే ఎవర్నో దారి అడగలేదు కదా?" అంది గాయత్రి భానుమూర్తి మొహంలోకి గుచ్చి గుచ్చి చూస్తూ.

మళ్ళీ దిక్కు మాలిన వాడిలా మొహం పెట్టి "ఊ." అన్నాడు భానుమూర్తి నీరసంగా.

"అప్పుడు నేను, 'అయ్యయ్యో పాపం... ఇంతటి మహానగరంలో దారి తెలీకపోతే కష్టమేనే!' అన్నాను అనునయంగా. వెంటనే వాడి కళ్ళలోకి మెరుపొచ్చేసింది. 'ప్లీజ్ ఏ బస్సెక్కాలో చెప్పరూ?' అన్నాడు వాడు.

మరి కాస్సేపు వాణ్ణి ఏడిపించుదామనుకునే లోగా బస్సొచ్చింది. వాడి కర్మానికి వాణ్ణి వదిలేసి నేను బస్సెక్కాను. తీరా వెనక్కి చూద్దును కదా బస్సెప్పుడెక్కాడో గానీ, వాడు నేను కూర్చున్న సీటు పక్కనున్న కడ్డీని పట్టుకుని నిలబడి ఉన్నాడు.

చెప్పొద్దూ.. నాకెక్కడ లేని కోపమూ వచ్చింది. వాడికి బుద్ధి చెప్పగల సమయం కోసం ఎదురు చూస్తూ ఓరగా వాణ్ణి గమనించ సాగాను. నా అంచనా తప్పు కాలేదు. కాస్సేపటి తర్వాత నా మెడ మీద ఏదో పురుగు పాకినట్టనిపించింది.

అంతే! దిగ్గున లేచి నిలబడి వాణ్ణి ఆ చెంపా ఈ చెంపా వాయించాను. అమాయకుడిలా మొహం పెట్టి ఏదో చెప్పబోయాడు వాడు. నా వెనుక సీట్లో కూర్చున్న ఆవిడ నాకేదో సర్ది చెప్పబోయిం ది. ఏం జరిగిందో ఊహించిన నా పక్కన కూర్చున్న ఆవిడ కూడా నాకు వత్తాసు పలికింది. కాస్సేపట్లోనే ఆడవాళ్ళందరూ వాణ్ణి తలో మాటా అన్నారు.

ఇదంతా జరిగాక ఆ బస్సులో మగాళ్ళకప్పుడు వాళ్ళ పెళ్ళాలూ, తల్లులూ, చెలెళ్ళూ గుర్తొచ్చారు కాబోలు. వాళ్ళు కూడా యధాశక్తి వాడికి దేహశుద్ధి చేసి వదిలారు. ఈ గొడవకు డ్రైవర్ బస్ ఆపు చేశాడు. కొందరేమో వాడిని పోలీస్‌స్టేషన్‌లో అప్పచెప్తే మంచిదని సలహా ఇచ్చారు. మరి కొందరు ఇంకా నాలుగు తగల్నివ్వ మన్నారు. చివరకు నేనే



జాలిపడి వాణ్ణి బస్‌లోంచి దింపేస్తే చాలని చెప్పి అందర్నీ ఒప్పించాను. ఇడియట్! ఇంకెప్పుడూ అటువంటి పని చేయడు!" అంది గాయత్రి గర్వంగా.

"పాపం నిజంగా వాడే నీ మెడ మీద చేయి వేశాడో లేక నీ పక్కన కూర్చున్నావిడే నీ మెడ సవరిస్తే నీకలా అనిపించిందో?" అన్నారు భానుమూర్తి విషయం మారుస్తూ.

"మగాళ్ళ మీద విరుచుకు పడతానని నన్నంటారు గానీ ఆడాళ్ళను ఆడిపోసుకోవడంలో ఎవరైనా మీ తర్వాతే" అంది గాయత్రి.

"నా ఉద్దేశ్యం అది కాదు. మర్డర్ చేసినవాడికైనా వాడి గోడు చెప్పుకునే అవకాశం ఇస్తుంది కదా మన చట్టం?" అన్నాడు భానుమూర్తి.

"అందుకే పట్టపగలు పదిమందీ చూస్తోండగా నడిరోడ్డు మీద హత్య చేసిన వాడికి శిక్ష వేసేందుక్కూడా ఏళ్ళూ పూళ్ళూ పడుతోంది," అంది గాయత్రి అవకాశం వదులుకోకుండా.

"వందమంది దోషులు తప్పించుకున్నా ఫర్వాలేదుగానీ ఒక్క నిర్దోషి కూడా శిక్షింపబడకూడదని కదా మన న్యాయశాస్త్రం ఘోషిస్తోంది?" అన్నాడు భానుమూర్తి.

"నాకదేం తెలీదు. ఆడాళ్ళనవమానించే మగ పురుగులకు ఎప్పటికప్పుడు, ఎక్కడికక్కడ బుద్ధి చెప్పడం మా మహిళా సంఘపు విధుల్లో అతి ముఖ్యమైనది." అని బట్టలు మార్చుకుందుకు లోపలికి వెళ్ళింది గాయత్రి.

భానుమూర్తి ఏదో అనేలోగా కాలింగ్‌బెల్ మ్రోగింది. తలుపు తీసిన భానుమూర్తికి, మొహమంతా ఉబ్బిపోయి, రేగిన జుట్టుతో, చినిగిన చొక్కాతో బెదురు చూపులు చూస్తోన్న ఒక వ్యక్తి కనిపించాడు. అతడి నెప్పుడూ చూసిన గుర్తు లేదు భానుమూర్తికి.

ఆ వ్యక్తి మాత్రం భానుమూర్తిని చూస్తూనే చంటిపిల్లాడిలా కేరింతలు కొడుతూ 'ఒరే భానూ..' అంటూ ఆనందంతో రెండడుగులు ముందుకు వేసి భానుమూర్తిని కౌగలించుకున్నాడు.

భానుమూర్తిని గట్టిగా పట్టుకుని అన్నాడా వ్యక్తి "నేనురా భాస్కర్‌ని. నన్ను చిన్నప్పుడు మీరందరూ దద్దోజనంగాడని ఏడిపించేవారు."

వెంటనే భానుమూర్తికి గుర్తొచ్చింది అతడెవరో. తన క్లాస్‌మేట్ చక్రధరం తమ్ముడు భాస్కర్ అతను. అతణ్ణి విడిపించుకుని, "ఏవిట్రా మొహంవలా వాచిపోయింది? అరే.. పెదాలు చిట్లి రక్తం కూడా వస్తోందే!" అంటూ అతడిని లోపలికి తీసుకొచ్చి గాయత్రిని పిలిచాడు.

"మీ ఊరికో దణ్ణంరా బాబూ. మొన్నా మధ్య పెళ్ళి చూపులకని భీమవరం వెళ్ళాను. పిల్ల బంగారపు బొమ్మలా లక్షణంగా ఉంది. పెళ్ళి చూపులయ్యాక ఆ పిల్ల మీ ఆవిడకు స్వయానా చెల్లెలే అని తెలిసింది. ఆ ఇంటి పిల్లను చేసుకునే ముందు నిన్నొకసారి కల్సుకుందామని అనిపించింది. సరిగ్గా అదే సమయంలో ఆఫీస్ పని మీద మా బాస్ నన్ను మీ ఊరికి పంపించాడు. మీ అమ్మావాళ్ళనడిగి నీ చిరునామా సంపాదించి సాయంత్రానికి ఈ ఊరు చేరుకున్నాను.

"ఇక్కడి కొచ్చే బస్‌లు ఎక్కడ ఆగుతాయో తెల్సుకుని సిటీబస్ స్టాపుకు చేరుకున్నాను. నేను పెళ్ళిచూపుల్లో చూసిన అమ్మాయి పోలికల్తో ఉన్న ఒకావిడ బస్‌స్టాప్‌లో కనిపిస్తే పలకరించాను.."

భాస్కర్‌ను మధ్యలో ఆపుచేసి, "ఆవిడ ఎర్రగా ఉంటుందా" అన్నాడు భానుమూర్తి.

'ఊ' అన్నాడు భాస్కర్ ఆశ్చర్యపోతూ.

"ఆవిడ భుజానికి నలర్లంగు వానిటీ బాగ్ ఉంటుంది?" అన్నాడు భానుమూర్తి.

"అవును. నీకెలా తెలుసు?" అని మరింత ఆశ్చర్యపోయాడు భాస్కర్.

"ఉండు. నన్నింకా అడగనీ," అని "ఆవిడ వయసు ఇరవైఆరు, ఇరవై ఏడేళ్ళుండవచ్చా?" అని అడిగాడు భానుమూర్తి. విభ్రమంతో తలూపాడు భాస్కర్.

"నువ్వావిడ చేతిలోని పత్రిక ఒకసారి ఇమ్మన్నావా?" అన్నాడు భానుమూర్తి.

"నీకు దివ్యదృష్టి లేదు కదా?" అన్నాడు భాస్కర్ ఇహ తట్టుకోలేక.

"మిమ్మల్నెక్కడో చూసినట్టుందని కూడా అన్నావా?" అన్నాడు భానుమూర్తి.

వెర్రిచూపులు చూసి ఏదో అడగబోయాడు భాస్కర్. "ఆగు. నా మాటలకు అడ్డు రాకు. ఆవిడ ఎక్కిన సిటీ బస్ నువ్వూ ఎక్కి ఆవిడ కూర్చున్న సీట్ వెనుక నిలబడ్డావా?" అన్నాడు భానుమూర్తి.

చేష్టలు దక్కి అలాగే నిలబడి పోయిన భాస్కర్ భుజాలు పట్టుకుని కుదిపి, "ఇప్పుడు చెప్పు! నీ చెంపలు ఆవిడెందుకు వాయించింది?" అన్నాడు భానుమూర్తి.

కొద్దిసేపటి క్రితం బస్‌లో తనకు జరిగిన అవమానం గుర్తొచ్చి భాస్కర్ కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరిగాయి.

"బస్‌లో చాలా రష్‌గా ఉంది. బస్‌స్టాప్‌లో నేను పలకరించిన ఆవిడ వెనుక సీట్లో కూర్చున్న ఆవిడ ముందుకు వంగి మెడ మీద చేయి వేసి గొలుసునటూ ఇటూ సవరించింది కాస్సేపు. ముందు నేను ఏ ఆడదొంగో గొలుసు కాజేసేందుకు ప్రయత్నిస్తోందేమో అనుకున్నాను. కానీ ఆవిడ ఓ దొంగలా కాకుండా గొలుసు పనితనాన్ని చూసే నిపుణురాలిలాగా తదేకదీక్షతో కాస్సేపటూ ఇటూ వేళ్ళను కదపడంతో కాదని సరిపెట్టుకున్నాను.

ఇంతలో ఏమైందో గానీ ఉన్నట్టుంది బస్‌స్టాప్‌లో నేను పలకరించినావిడ లేచి నిలబడి నా చెంపల్ని ఎడా పెడా వాయించింది. నేను చెప్పేది ఎవరూ వినిపించుకోలేదు. చివరికి గొలుసు సవరించినావిడ ఏదో చెప్పబోయినా ఎవరూ పట్టించుకోలేదు. ఆ బస్‌లోని ఆడా మగా అందరూ నన్ను చెడుగుడు ఆడేసి బస్‌లోంచి క్రిందికి దింపేశారు. ఎలాగో చావు తప్పి కన్ను లొట్టపోయి మళ్ళీ బస్సు ఎక్కే ప్రయత్నం చేయకుండా కనిపించిన వాళ్ళందరినీ దారి అడుగుతూ చివరికిక్కడికి చేరుకున్నాను." అని ముగించాడు భాస్కర్.

ఈ లోగా గాయత్రి అక్కడికి వచ్చింది. వస్తూనే, భాస్కర్‌ను చూసి బిగ్గరగా, "వీడే.. వీడే.. వీడేనండీ .. బస్‌లో నన్నల్లరి చేసింది!" అని భానుమూర్తితో అని, "చివరికిక్కడికి కూడా వచ్చావా? నిన్నందరూ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించమని సలహా ఇచ్చినా పోన్లే కదా అని జాలిపడి వదిలేస్తే బుద్ధిగా నీ దారిన నువ్వు పోక ఎడ్రస్ కూడా కనుక్కుని ఇంటికే సరాసరి వచ్చావంటే .. హమ్మో.." అంటూ భాస్కర్ మీదకు వెళ్ళబోయిందామె.

"ఈవిడే.. ఈవిడేరా.." అంటూ రెండు చెంపల్నీ రెండు చేతులతోనూ దాచుకుంటూ భానుమూర్తి వెనుక దాక్కున్నాడు భాస్కర్.

గాయత్రిని వారించి, భాస్కర్‌ను తన వెనుక నుంచి ముందుకు లాగి, "ఈవిడేరా మీ వదినగారు.. నమస్కారం పెట్టుకో" అన్నాడు భానుమూర్తి.

"ఏమిటీ వెధవ పనులు చేసేవాడికి నేను వదిననా?" అంటూ గర్జించింది గాయత్రి.

"శాంతి.. శాంతి.. అక్షరాలా నువ్వు వాడికి వదినవే.. కాకపోతే కాబోయే వదినవు" అన్నాడు భానుమూర్తి ఆమెకు ఆలోచించుకునే అవకాశం ఇస్తూ.

బస్‌లో తనకు జరిగిన అనుభవాన్నంత వివరంగా చెప్పాక కూడా భానుమూర్తి అంత తాపీగా మాట్లాడటం చూసి తన చెవుల్ని తానే నమ్మలేకపోయింది గాయత్రి. 'ఈ జులాయి వెధవకు తాను వదిననట.! ఊహు .. కాబోయే వదిననట! అంటే కొంపదీసి .. ఇటీవల తన చెల్లెల్ని చూసుకుందుకు ఎవరో వచ్చారనీ, సంబంధం ఇంచుమించు ఖాయమైనట్టేననీ రాశారు అమ్మానాన్నా. ఇతడే అతడు కాదు కదా?'

అయోమయంగా చూస్తోన్న గాయత్రినుద్దేశించి, "సాక్షాత్తూ నీ చెల్లెలిక్కాబోయే భర్తే ఈ భాస్కర్. మీ చెల్లెలికీ నీకూ పోలికలుండడంతో నిన్ను పలకరించబోయి భంగపడ్డాడు తప్ప నువ్వనుకున్నట్టు జులాయి వెధవ మాత్రం కాదు," అని అసలేం జరిగిందో వివరించాడు భానుమూర్తి.

వెంటనే గాయత్రి ముఖకవళికల్లో మార్పొచ్చేసింది. 'పోన్లెండి.. మీ బుద్ధులేవీ మా మరిదిగారికి రాలేదు. మా చెల్లెలు పొరపాటున చేయి చేసుకున్నా ఏమీ ఫర్వాలేదు. మగాళ్ళంతా మా మరిదిగారిలా ఉంటే స్త్రీ హక్కులంటూ బజార్న పడి తిరగడం మాకు మాత్రం సరదానా?" అని నవ్వు మొహంతో భాస్కర్‌వైపు చూసి, "రండి మరిదిగారూ.. మా చెల్లెలికీ నాకూ బుద్ధుల్లో అస్సలు పోలికలు లేవనే విషయం మీకు తెలియదు కదూ!" అంటూ అతన్ని సాదరంగా ఆహ్వానించిన గాయత్రి వైపు తెల్లబోయి చూశాడు భానుమూర్తి. ◆